సాక్షి అనంతపురం

మంగళవారం । 16 । సెప్టెంబర్ । 2025



చీనీ టన్ను రూ.15 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.15 వేలు పలికాయి.



టమాట కిలో రూ.15

అనంతపురం కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.15 పలికింది. కనిష్టం రూ.8, సరాసరి రూ.12 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్ఠం/కనిష్ఠం

34.5°/21.1°

జిల్లా అంతటా సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. పశ్చిమ దిశగా గంటకు 8 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

బొగ్గు అక్రమ రవాణాపై నివేదిక పంపండి!

సాక్షి ఎఫెక్ట్..

రాయదుర్గం:అనధికారికంగా నడుపుతున్న బొగ్గు బట్టీలను గుర్తించి అక్రమ రవాణా జరిపే వారిపై నివేదిక పంపాలని విజయవాడ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయం నుంచి జిల్లా అటవీశాఖ అధికారులకు ఆదేశాలు అందినట్టు తెలిసింది. సోమవారం 'పచ్చదనం బొగ్గుపాలు' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్పందించారు. జిల్లా అటవీశాఖ అధికారుల నుంచి నివేదిక కోరారు. ఈ క్రమంలోనే డీఎఫ్‌ఓ ఆదేశాల మేరకు మంగళవారం నుంచి సిబ్బంది క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళుతున్నట్టు సమాచారం.

'దుర్గం'లో తమ్ముళ్ల దౌర్జన్యం



వైఎస్సార్ సీపీ నేతలతో వాగ్వాదానికి దిగిన టీడీపీ నాయకులు

రాయదుర్గం టౌన్: రాయదుర్గంలో 'తమ్ముళ్లు' దౌర్జన్యానికి దిగారు. 31, 32 వార్డుల్లో సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, వార్డు కౌన్సిలర్ల ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని నిర్వహిస్తుండగా టీడీపీ నాయకులు భోజ శంకర్, తిప్పేస్వామి, ఎల్లప్ప, రాజశేఖర్ తదితరులు అడ్డుకుని నాయకులతో వాదనకు దిగారు. వైఎస్సార్‌సీపీ నాయకులు దీటుగా జవాబివ్వడంతో నీళ్లు నమిలారు. టీడీపీ నాయకుల తీరుపై స్థానికులు విస్తుపోయారు. ఈ విషయంపై చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప మాట్లాడుతూ తమ పార్టీ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా బాబు ష్యూరిటీ..మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలతో మమేకమై సమస్యలు అడిగి తెలుసుకోవడంతో పాటు పథకాలు అందుతున్నాయో లేదో తెలుసుకుంటున్నామన్నారు. అలాంటి కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు అడ్డుకోవడం సరికాదన్నారు. ఇది ముమ్మాటికీ నీచ సంస్కృతి అని, ఒకవేళ ప్రభుత్వం మంచి చేస్తుంటే టీడీపీ నాయకులకు అంత ఉలుకెందుకుని ప్రశ్నించారు.

నిలకడగా శైలజనాథ్ ఆరోగ్యం



శింగనమల: మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజనాథ్ ఆరోగ్యం నిలకడగా ఉంది. మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతూ హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న ఆయన సోమవారం కొద్ది మేర కోలుకున్నారు. అయితే పూర్తిగా కోలుకునే వరకూ ఆస్పత్రిలోనే ఉంచనున్నట్లు వైద్యులు పేర్కొన్నారు. కాగా, మూడు రోజులుగా తనపై నియోజకవర్గ ప్రజలు, పార్టీ శ్రేణులు చూపిన ప్రేమానురాగాలకు శైలజనాథ్ ధన్యవాదాలు తెలిపారు.

"నీ ఊరికి మెడికల్ కాలేజీ వస్తే దగ్గరుండి కట్టించాల్సింది పోయి నిస్సహాయంగా నిలబడ్డావా..?"

"మంత్రి పదవి జగన్‌ను తిట్టడానికి ఇచ్చారా, లేకుంటే అభివృద్ధి చేయడానికా..?"

"అనంతపురంలో సర్వజనాసుపత్రి పరిస్థితి ఒక్కసారి చూడు నీకే అర్థమవుతుంది నీ ప్రభుత్వ పరిస్థితి ఏమిటో.."

ఇవేవో.. అధికార పార్టీ ప్రజాప్రతినిధులపై ప్రతిపక్ష నాయకులు చేసిన విమర్శలు అనుకుంటే పొరబడినట్లే. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మంజూరైన మెడికల్ కళాశాలలపై కూటమి మంత్రులు ఇటీవల చేసిన వ్యాఖ్యలపై సామాజిక మాధ్యమాల వేదికగా నెటిజన్లు విసిరిన విమర్శనాస్త్రాలివీ.



గత ప్రభుత్వ హయాంలో జరిగిన పెనుకొండ మెడికల్ కళాశాల భవన నిర్మాణ పనులను తెలియజేస్తూ సెల్ఫీ తీసుకుంటున్న మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ (ఫైల్)

అబద్ధాలపై ఆగ్రహావేశాలు



కారుకూతలపై కౌంటర్ల వర్షం

- మంత్రులకు జనం ఝలక్
- సవిత, సత్యకుమార్‌పై సోషల్ మీడియాలో విమర్శల వెల్లువ
- సవిత సొంత నియోజకవర్గానికి మెడికల్ కాలేజీ వస్తే కట్టించుకోలేని దుస్థితి
- ఆరోగ్యశాఖ మంత్రిపైనా నెటిజన్ల నిప్పులు
- స్విమ్మింగ్ పూల్ వ్యాఖ్యలకు అమరావతి వరద ఫొటోలతో కౌంటర్
- ఎంసీహెచ్ బ్లాక్, సర్జరీ బ్లాక్ వరకూ గత ప్రభుత్వ హయాంలో వచ్చినవే
- మంత్రి సవిత వ్యాఖ్యలకు మాజీ మంత్రి ఉషశ్రీ వ్యాఖ్యలతో కౌంటర్ ట్యాగ్‌లైన్‌లు

సాక్షి ప్రతినిధి, అనంతపురం:అవగాహన రాహిత్యంతో వ్యాఖ్యలు చేస్తూ ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు పరువు పోగొట్టుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ కాలేజీలన్నీ పీపీపీ విధానంలో నిర్వహిస్తామంటూ ఇటీవల అనంతపురం సభలో సీఎం చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు మంత్రుల మెడకు చుట్టుకున్నాయి. బాబు తానా అంటే మంత్రులు తందానా అంటున్న వైనంపై సామాజిక మాధ్యమాల్లో నెటిజన్లు నిప్పులు చెరుగుతున్నారు. గత నాలుగు రోజులుగా మంత్రులపై నెటిజన్లు చేస్తున్న ట్రోలింగ్ అంతా ఇంతా కాదు. ప్రభుత్వం అందించాల్సిన వైద్య సేవలను ప్రైవేటుకు అప్పజెబుతుంటే 'అసలు మీరు మంత్రులేనా' అంటూ ఫైర్ అవుతున్నారు.

సొంతూరికి మెడికల్ కాలేజీ వస్తే..

గత ప్రభుత్వ హయాంలో పెనుకొండకు మెడికల్ కాలేజీ మంజూరు చేయడమే కాదు, దాదాపు మూడు అంతస్తుల నిర్మాణమూ జరిగింది. 50 ఎకరాల్లో రూ.375 కోట్లతో చేపడుతున్న ఈ ప్రాజెక్టు పనులు కూటమి ప్రభుత్వం రాగానే ఆగిపోయాయి. కళాశాల నిర్మాణాన్ని పూర్తి చేయాల్సిన పెనుకొండ శాసన సభ్యురాలు, స్వయానా మంత్రి అయిన సవిత.. కాలేజీ నిర్మాణం సందర్శనకు వెళ్లి వెటకారంగా చేసిన వ్యాఖ్యలపై సోషియల్ మీడియా యాక్టివిస్టులు భగ్గుమంటున్నారు. సొంత ప్రాంతానికి మెడికల్ కాలేజీ వస్తే దగ్గరుండి కట్టించాల్సింది పోయి అన్యాయంగా మాట్లాడతారా అంటూ దుయ్యబడుతున్నారు. మంత్రి పదవి జగన్‌ను తిట్టడానికి ఇచ్చారనుకుంటున్నారా అంటూ నిలదీస్తున్నారు. ఇదే క్రమంలో సవిత వ్యాఖ్యలకు కౌంటర్‌గా 'ఇక్కడి నుంచి దూకు.. నిర్మాణం ఎంత పూర్తయిందో తెలుస్తుంది' అంటూ రెండు రోజుల క్రితం మాజీ మంత్రి ఉషశ్రీ చేసిన వ్యాఖ్యలను జోడించడం గమనార్హం.

'అసలు నీకు ఆరోగ్యమంటే తెలుసా..'

మంత్రి సత్యకుమార్‌పైనా నెటి'జనం' నుంచి విమర్శల వర్షం కురుస్తోంది. ధర్మవరానికి వలస పక్షిలా వచ్చిన ఆయనకు ఆరోగ్యశాఖ గురించి ఏం తెలుసు అంటూ సెటైర్లు వేస్తున్నారు. ప్రభుత్వమే కాలేజీలు కడితే మరో 20 ఏళ్లు పడుతుందని జగన్‌కు సత్యకుమార్ లేఖ రాయడంపైనా ఘాటు విమర్శలు చేస్తున్నారు. 'అసలు నీకు ఆరోగ్యమంటే తెలుసా.. ఐదు కాలేజీలు ప్రారంభమయ్యాయి కదా' అంటూ మండిపడుతున్నారు. 'అనంతపురంలో సర్వజనాసుపత్రి పరిస్థితి ఒక్కసారి చూడు.. నీకే అర్థమవుతుంది నీ ప్రభుత్వ పరిస్థితి ఏమిటో' అంటూ కొంతమంది జీజీహెచ్ ఫొటోలు ఆయన లేఖకు జత చేసి ఫేస్‌బుక్‌లో పెట్టారు.



మంత్రి సవిత



మంత్రి సత్యకుమార్

ముందుగా అది చూడమ్మా..

మంత్రి సవిత పెనుకొండ కాలేజీపై చేసిన 'స్విమ్మింగ్‌పూల్' వ్యాఖ్యలపై నెటిజన్లు పేల్చిన సెటైర్‌లు వైరల్ అవుతున్నాయి. రూ. వేల కోట్లు ఖర్చు చేసి అమరావతిలో రాజధాని కడుతున్నారు. ఆ ప్రాంతం నుంచి వరద నీళ్లు బయటకు తోడేందుకు కూడా రూ. కోట్లు ఖర్చు చేస్తున్నారు. ముందుగా అది చూడమ్మా సవితమ్మా.. అంటూ కౌంటర్ల మీద కౌంటర్లు వేస్తున్నారు. మూడు రోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది.

గత ప్రభుత్వ హయాంలో మంజూరైనవి ఇలా

పెనుకొండ మెడికల్ కాలేజీ	50 ఎకరాల్లో
ప్రాజెక్టు అంచనా	రూ.375 కోట్లు
ఇప్పటివరకూ చేసిన వ్యయం	రూ.30 కోట్లు
అనంతపురంలో సర్జికల్ బ్లాక్	రూ.68 కోట్లు
ఎంసీహెచ్ బ్లాక్	రూ.72 కోట్లు
మెన్స్, ఉమెన్స్ పీజీ హాస్టల్	రూ.22 కోట్లు
50 పడకల క్రిటికల్ కేర్	రూ.23.75 కోట్లు
50 ఎంబీబీఎస్ సీట్ల పెంపు	రూ.60 కోట్లు

సమస్యలు పరిష్కరించండి

- 'పరిష్కార వేదిక'కు 334 వినతులు



అర్జీలు స్వీకరిస్తున్న జేసీ శివ్ నారాయణ్ శర్మ

అనంతపురం అర్బన్:సమస్యలు పరిష్కరించండంటూ ప్రజలు అధికారులకు విన్నవించుకున్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో ప్రజల నుంచి జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మతో పాటు అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, డీఆర్‌ఓ ఎ.మలోల, డిప్యూటీ కలెక్టర్లు రామ్మోహన్, ఆనంద్, మల్లికార్జునరెడ్డి, తిప్పేనాయక్, మల్లికార్జునుడు, వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై 334 వినతులు అందాయి. కార్యక్రమం అనంతరం అర్జీల పరిష్కారంపై అధికారులతో జేసీ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యానికి తావివ్వకూడదని ఆదేశించారు. అర్జీదారులతో మాట్లాడి సమస్యను క్షుణ్ణంగా తెలుసుకుని వారు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం చూపించాలని చెప్పారు.

వినతుల్లో కొన్ని..

- అనంతపురం రూరల్ పంచాయతీ భైరవ నగర్‌లో అక్రమంగా సెల్‌టవర్ నిర్మిస్తున్నారని లక్ష్మీదేవి, వెంకటేష్ నాయక్ ఫిర్యాదు చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా, కనీసం భద్రతా చర్యలు చేపట్టకుండా సెల్ టవర్ నిర్మిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.
- తమ భూమిలోకి తాము వెళ్లకుండా కొందరు అడ్డుపడుతున్నారని కంబదూరు మండలం తిప్పేపల్లి ఎస్సీ కాలనీకి చెందిన మాదిగ చిన్న పెద్దన్న ఫిర్యాదు చేశాడు. నూతిమడుగు గ్రామ పొలం సర్వే నంబరు 559-3లో 4.99 ఎకరాల డీ పట్టా భూమి ఉందని చెప్పాడు. పక్క పొలం వారు తమను పొలంలోకి వెళ్లనీయకుండా దారి లేదని చెబుతూ మూసివేశారని చెప్పాడు. న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశాడు.
- బుద్ధిమాంద్యంతో బాధపడుతున్న తన 11 ఏళ్ల కుమారుడు శశికుమార్‌కు పింఛన్ మంజూరు చేయించాలని బుక్కరాయసముద్రం మండలం గేనే కాలనీకి చెందిన లక్ష్మి విన్నవించింది. శశికుమార్ కనీసం కదల్లేడని చెప్పింది. పింఛను కోసం దరఖాస్తు చేసుకున్నా మంజూరు కావడం లేదని, వేలిముద్రలు పడడం లేదని చెబుతున్నారని వాపోయింది. ఉన్నతాధికారులైనా స్పందించి పరిష్కరించాలని వేడుకుంది.

డీఎస్సీ ఎంపిక జాబితా విడుదల

- జిల్లాలో 811 పోస్టులకు గాను 755 పోస్టుల భర్తీ
- వివిధ కేటగిరీల్లో 55 పోస్టులకు అభ్యర్థులు లేరు
- ఎంపికైన అభ్యర్థులకు 19న అమరావతిలో సమావేశం

అనంతపురం ఎడ్యుకేషన్: డీఎస్సీ-25 తుది ఎంపిక జాబితా సోమవారం విడుదల చేశారు. ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచారు. జిల్లాలో మొత్తం 811 పోస్టులకు గాను 755 పోస్టులు భర్తీ చేస్తున్నారు. తక్కిన 56 పోస్టులకు అర్హులైన అభ్యర్థులు లేరని అధికారులు ప్రకటించారు. జూన్ 6 నుంచి జూలై 2 వరకు సీబీటీ విధానంలో పరీక్షలు నిర్వహించారు. గతనెలలో తుది కీ విడుదల చేశారు. నార్మలైజేషన్ ప్రక్రియ పూర్తి చేసి టెట్ స్కోరును డీఎస్సీ స్కోరుకు వెయిటేజీ ఇచ్చి మెరిట్ జాబితాలు రూపొందించారు. ఈ జాబితా ప్రకటించిన అనంతరం చేపట్టిన సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ అభ్యర్థులను గందరగోళానికి గురి చేసింది. ఎట్టకేలకు పలు దశల్లో సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేసి తుది జాబితాను విడుదల చేశారు. జిల్లాకు వచ్చేసరికి స్థానిక సంస్థలు, ప్రభుత్వ పాఠశాలల్లో 629 పోస్టులు, మునిసిపల్ స్కూళ్లలో 64 పోస్టులు, మునిసిపల్ కార్పొరేషన్ స్కూళ్లల్లో 58 పోస్టులు, ట్రైబల్ వెల్ఫేర్ స్కూళ్లలో 4 పోస్టులు భర్తీ చేస్తున్నారు. ఎంపికై న అభ్యర్థులతో 19న అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశం ఏర్పాటు చేయనున్నారు. అదేరోజు కొందరికి నియామక పత్రాలు అందజేయనున్నారు. రాయలసీమ జిల్లాల పరిధిలోని కొత్త టీచర్లందరికీ 21వ తేదీ నుంచి వారం రోజుల పాటు తిరుపతిలో శిక్షణ ఇవ్వనున్నారు.

జిల్లాలో భర్తీ చేస్తున్న పోస్టులు

స్కూల్ అసిస్టెంట్ బీఎస్ (తెలుగు) 71 పోస్టులు, ఎస్‌ఏ ఇంగ్లిష్ 101 పోస్టులు, ఎస్‌ఏ హిందీ 26 పోస్టులు, ఎస్‌ఏ గణితం (తెలుగు) 41, ఎస్‌ఏ ఫిజికల్ ఎడ్యుకేషన్ 142, ఎస్‌ఏ ఫిజికల్ సైన్స్ (తెలుగు) 65, ఎస్‌ఏ సోషల్ (తెలుగు) 109, ఎస్‌ఏ తెలుగు 27, ఎస్‌ఏ ఉర్దూ 05, ఎస్జీటీ కన్నడ 05, ఎస్జీటీ తెలుగు 148, ఎస్జీటీ ఉర్దూ 14, స్కూల్ అసిస్టెంట్ సోషల్ (ఉర్దూ) ఒక పోస్టు భర్తీ కానున్నాయి.

ప్రశ్నపత్రం తారుమారు

అనంతపురం: ఎల్‌ఎల్‌బీ పరీక్షల్లో ప్రశ్నపత్రం తారుమారు కావడంతో విద్యార్థులు ఆందోళన చెందారు. సోమవారం ఎస్కేయూలో ఎల్‌ఎల్‌బీ రెండో సెమిస్టర్‌లో భాగంగా ఫ్యామిలీ లా -1 పరీక్ష నిర్వహించారు. వర్సిటీలోని ఫార్మసీ కళాశాల పరీక్షల భవనంలోని గది నంబర్ -4లో ప్రశ్నపత్రం తారుమారైంది. వాస్తవంగా ఫ్యామిలీ లా -1 సబ్జెక్టుకు 80 మార్కులు ఎక్స్‌టర్నల్, 20 మార్కులు ఇంటర్నల్ మార్కులు కేటాయించారు. ప్రస్తుతం 80 మార్కులకు పరీక్ష జరగాల్సి ఉంది. అయితే 100 మార్కుల ప్రశ్నపత్రాన్ని అందజేయడం గమనార్హం. ఇందులోనూ కొంతమందికి వేర్వేరు ప్రశ్నపత్రాలు అందజేయడంతో గందరగోళం నెలకొంది. 40 మంది విద్యార్థులకు సమస్య ఎదురైంది. దీనిపై ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి వర్సిటీ రిజిస్ట్రార్ రమేష్ బాబుకు ఫిర్యాదు చేశారు.



వాస్తవ ప్రశ్నపత్రం (80 మార్కులు)



సిలబస్‌లో లేని ప్రశ్నలతో ప్రశ్నపత్రం (100 మార్కులు)

పోలీసుల భయం..తీసింది ప్రాణం

- పేకాట కేసులో స్టేషన్‌కు రావాలని పోలీసుల వాకబు
- తీవ్ర భయాందోళనకు గురైన నిందితుడు
- గ్రామం నుంచి బైక్‌లో వస్తుండగా గుండెపోటు
- శింగనమల సీహెచ్‌సీలో చికిత్స పొందుతూ మృతి
- స్టేషన్ ఎదుట గ్రామస్తుల ధర్నా

శింగనమల: మండలంలోని నాగులగుడ్డం తండాకు చెందిన రామకృష్ణ నాయక్ (35) పోలీసులకు భయపడి గుండెపోటుకు గురై మృతి చెందాడు. దీంతో గ్రామస్తులు పోలీసుల వైఖరిని నిరసిస్తూ స్టేషన్ ఎదుట మృతదేహంతో ధర్నా చేశారు. వివరాలిలా ఉన్నాయి. నాగులగుడ్డం తండాలో పేకాట ఆడుతున్నారని శింగనమల పోలీసులకు సమాచారం రావడంతో ఎస్‌ఐతో పాటు ముగ్గురు స్పెషల్ పార్టీ పోలీసులు ఆదివారం వెళ్లారు. పేకాట శిబిరంపై దాడి చేసి.. కొంత నగదు, సెల్‌ఫోన్లు తీసుకెళ్లారు. పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులు సోమవారం ఉదయం పోలీస్‌స్టేషన్‌కు రావాలని సూచించారు. అందరూ సోమవారం బైక్‌లపై పోలీస్‌స్టేషన్‌కు బయలుదేరారు. పోలీసులు కొడతారని రామకృష్ణ నాయక్ తీవ్రంగా భయపడిపోవడంతో మార్గమధ్యంలోనే గుండెపోటు వచ్చింది. వెంటనే శింగనమల కమ్యూనిటీ హెల్త్ సెంటరుకు తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు తీవ్ర ప్రయత్నాలు చేసినా ఫలితం లేకుండా పోయింది. ఆసుపత్రిలోనే కన్ను మూశాడు. విషయం తెలుసుకున్న నాగులగుడ్డం తండా వాసులు, కుటుంబసభ్యులు కమ్యూనిటీ హెల్త్‌సెంటరుకు తరలివచ్చారు. అక్కడి నుంచి మృతదేహాన్ని స్ట్రెచర్ మీద తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు ర్యాలీగా బయలుదేరారు. పోలీసులు, మండల టీడీపీ నాయకులు అడ్డుకోవడానికి ప్రయత్నించినా పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకుని ధర్నా చేపట్టారు. చివరకు బాధితుడి కుటుంబసభ్యులు, గ్రామస్తులతో టీడీపీ నాయకులు, పోలీసులు చర్చించారు. రామకృష్ణ నాయక్ భార్యకు అంగన్‌వాడీ వర్కర్ పోస్టు ఇప్పించేలా కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. మృతుడికి భార్య ఇంద్ర, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య బాలింత కావడంతో ప్రస్తుతం పుట్టినిల్లు జొన్నగిరిలో ఉంది. కాగా..ఈ ఘటనపై డీఎస్పీతో విచారణ చేయిస్తామని జిల్లా ఎస్పీ జగదీష్ తెలిపారు. రామకృష్ణ నాయక్‌ను తాము కొట్టలేదని, కనీసం బెదిరించలేదని శింగనమల సీఐ కౌలుట్లయ్య వివరణ ఇచ్చారు.



మృతి చెందిన రామకృష్ణ నాయక్



సీఐ కౌలుట్లయ్యను నిలదీస్తున్న గ్రామస్తులు, కుటుంబసభ్యులు

దిక్కుతోచని అన్నదాతలు

- 'పచ్చ' నేతల కనుసన్నల్లో యూరియా అమ్మకాలు
- రైతులకు తప్పని తిప్పలు



కణేకల్లులోని పీఏసీఎస్ వద్ద యూరియా కోసం ఎండలో నిరీక్షిస్తున్న రైతులు



కణేకల్లు ఆదర్శ భారతి రైతు సేవా సహకార సంఘం వద్ద రైతుల రద్దీ

అనంతపురం అగ్రికల్చర్: 'పచ్చ' నేతల కనుసన్నల్లో యూరియా అమ్మకాలు జరుగుతున్నాయి. దీంతో సాధారణ రైతులకు నెల రోజులుగా యూరియా తిప్పలు తప్పడం లేదు. జిల్లాకు చేరుతున్న యూరియాను 'తెలుగు తమ్ముళ్లు' పంచుకుంటున్నారు. తాము చెప్పిన వారికే యూరియా ఇవ్వాలని ఒత్తిళ్లు తెస్తుండటంతో అధికారులకు పాలుపోవడం లేదు. ఈ క్రమంలో రైతులు ఉదయం 6 గంటలకే ఆర్‌ఎస్‌కేలు, సొసైటీలు, దుకాణాల వద్ద బారులు తీరుతున్నా ఒక్క బస్తా కూడా దొరకని దుస్థితి నెలకొంది. తమ బాధను ఎవరికి చెప్పుకోవాలో దిక్కుతోచక దిక్కులు చూస్తున్నారు. యూరియా కోసం రైతులు పడుతున్న కష్టనష్టాలపై ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, జిల్లా యంత్రాంగం ఇలా ఏ ఒక్కరూ స్పందించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కాకిలెక్కలతో బురిడీ..

యూరియాపై కాకిలెక్కలతో వ్యవసాయశాఖ అధికారులు రైతులను బురిడీ కొట్టిస్తున్నారు. 4,600 మెట్రిక్ టన్నులు ఉన్నట్లు చెబుతున్నా వాస్తవ పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా ఉన్న 436 ఆర్‌ఎస్‌కేలు, మూడు డీసీఎంఎస్‌లు, 13 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్), రెండు ఎఫ్‌పీఓలు, మూడు ప్రైవేట్ హోల్‌సేల్ డీలర్లు, 460 రీటైల్ దుకాణాల్లో యూరియా నిల్వలు దాదాపు అడుగంటిపోయాయి. అంతో ఇంతో ఉన్న యూరియా 'తమ్ముళ్ల'కే సరిపోతోందని చెబుతున్నారు. అలాగే అధికార పార్టీ నేతల కోసం బఫర్‌స్టాక్ కింద మాత్రం 700 మెట్రిక్ టన్నులు పెట్టుకున్నారు. ఈనెలలో మంచి వర్షాలు పడటంతో పంటల సాగు పెరిగింది. యూరియా వాడకం అవసరం కావడంతో రైతులు ఎగబడుతున్నా ఒక్క బస్తా దొరకడం కూడా కష్టంగా మారింది.

మండుటెండలో పడిగాపులు

కణేకల్లు: హెచ్చెల్సీ ఆయకట్టు ప్రాంతమైన కణేకల్లులో యూరియా కోసం రైతులు నానా అవస్థలు పడుతున్నారు. మండలంలోని కణేకల్లు పీఏసీఎస్, ఆదర్శభారతి రైతుసేవా సహకార సంఘం, బ్రహ్మసముద్రం పీఏసీఎస్‌లతోపాటు గెనిగెరలో రెండు ఫర్టిలైజర్ షాపులు, బెణికల్లు ఒకటి, యర్రగుంట ఒకటి, కణేకల్లులో ఒకటి, కొత్తపల్లి ఒక ఫర్టిలైజర్‌షాపులకు యూరియా సరఫరా అయ్యింది. ఒక్కో సొసైటీకి 18.45 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేశారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం 7 గంటలకే సొసైటీల వద్ద యూరియా కోసం రైతులు బారులు తీరారు. ఎండవేడిమికి తట్టుకోలేక అల్లాడిపోయారు. కణేకల్లులోని ఆదర్శభారతి రైతుసేవా సహకార సంఘం, కణేకల్లు పీఏసీఎస్‌కు రైతులు భారీ సంఖ్యలో తరలిరావడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఏఎస్‌ఐ శంకర్‌రెడ్డితో పాటు పోలీసులు పంపిణీ కేంద్రాల వద్దకు చేరుకొని రైతులకు సర్దిచెప్పారు. గంటల సమయం వేచి ఉన్నా దొరుకుతోంది ఒక్క బస్తానే కావడంతో రైతుల వేదన వర్ణనాతీతంగా మారింది. యూరియా కోసం నిత్యం కుస్తీలు పడుతున్నా కూటమి ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని, తాగుబోతులకు ఎంత కావాలన్నా మద్యం దొరుకుతోంది కానీ రైతన్నకు మాత్రం కావాల్సినంత యూరియా లభించడం లేదని దుమ్మెత్తిపోస్తున్నారు.

క్లుప్తంగా

నీట మునిగి బాలుడి మృతి

శెట్టూరు: ప్రమాదవశాత్తు నీటి తొట్టిలో పడి ఓ బాలుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన మేరకు... శెట్టూరు గ్రామానికి చెందిన రాజప్ప కుమారుడు తరుణ్ (17) తన పెద్ద నాన్న నరసింహులుకు చెందిన పొలంలో వేరుశనగ వామి వేయడానికి సోమవారం చిన్నంపల్లికి వెళ్లాడు. పని ముగించుకున్న అనంతరం సాయంత్రం నీటి తొట్టి వద్దకు వెళ్లి శరీరాన్ని శుభ్రం చేసుకుంటుండగా అదుపు తప్పి నీటిలో పడిపోయాడు. ఈత రాకపోవడంతో నీట మునిగిపోయాడు. ఎంతసేపటికీ రాకపోయేసరికి బంధువులు నీటి తొట్టి దగ్గరకు వెళ్లి చూడగా.. గట్టుపై దుస్తులు, సెల్‌ఫోన్ కనిపించడంతో అనుమానం వచ్చి తొట్టిలో గాలింపు చేపట్టి తరుణ్ మృతదేహాన్ని వెలికి తీశారు.

యువకుడి దుర్మరణం


అజయ్ (ఫైల్)

ఉరవకొండ రూరల్: లారీ ఢీకొన్న ఘటనలో ద్విచక్రవాహనదారుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.. ఉరవకొండ మండలం మూలగిరిపల్లికి చెందిన అజయ్(19), జగన్ సోమవారం వ్యక్తిగత పనిపై ఉరవకొండకు బయల్దేరారు. పెన్నహోబిలం సమీపంలోకి చేరుకోగానే ఎదురుగా వేగంగా దూసుకొచ్చిన లారీ ఢీకొంది. ఘటనలో అజయ్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన జగన్‌ను తొలుత ఉరవకొండలోని ప్రభుత్వాస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించిన, అనంతరం అనంతపురానికి తరలించారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

వాస్తవాలు రాస్తున్నారనే 'సాక్షి'పై అక్రమ కేసులు



తెలుగు ప్రజలకు వాస్తవాలు తెలియజేస్తున్న 'సాక్షి' పత్రికపై కూటమి ప్రభుత్వం అక్కసు వెల్లగక్కుతోంది. ప్రతిపక్ష నేతలను, ప్రజల పక్షాన మాట్లాడే 'సాక్షి'ని నోరు మూయించాలనే ఉద్దేశంతో వ్యవహరిస్తున్నారు. చంద్రబాబు పాలనలో చేసిందేమీ లేకపోయినా ఏదో అద్భుతాలు జరుగుతున్నట్లు ఎల్లో మీడియాలో చూపిస్తున్నారు. కానీ 'సాక్షి'లో వాస్తవాలు రాస్తున్నందున చంద్రబాబు బండారం ఎప్పటికప్పుడు ప్రజలకు తెలిసిపోతోంది. అందుకే 'సాక్షి' పత్రిక ఎడిటర్ ధనంజయరెడ్డిపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారు. కూటమి ప్రభుత్వం తన తప్పులను సరిచేసుకోకుండా కక్ష సాధింపు చర్యలకు దిగడం సిగ్గుచేటు. అక్రమ కేసులు, అరెస్టులు 'సాక్షి'ని ఏమీ చేయలేవు.

– మహమ్మద్ షాకీర్, మాజీ మంత్రి, కదిరి



పత్రికా స్వేచ్ఛను కాపాడాలి



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో పత్రికా స్వేచ్ఛ కరువైంది. ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పనిచేస్తున్న పత్రికలపై, పత్రికా విలేకరులపై ఈ మధ్యకాలంలో కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు బనాయిస్తోంది. రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పత్రిక ద్వారా ప్రభుత్వానికి, అధికారులకు తెలియజేస్తున్న జర్నలిస్టులపై దాడులు చేయడం, అక్రమ కేసులు బనాయించడం రాజ్యాంగ విరుద్ధం. రాజ్యాంగంలో ఉన్న వాక్ స్వాతంత్ర్యాన్ని కూటమి ప్రభుత్వం కాలరాస్తోంది. దీనిని ఎస్ఎఫ్ఐ అనంతపురం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తోంది. పత్రికా స్వేచ్ఛను కాపాడాలి.

– ఓతూరు పరమేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

పట్టు తప్పిన ప్రోత్సాహకం

- బైవోల్టిన్ పట్టు రైతులకు అందని రాయితీ సొమ్ము
- ఉమ్మడి అనంతపురం జిల్లాలో పేరుకు పోయిన రూ.27 కోట్ల బకాయిలు
- రీలర్లకూ అందని ప్రోత్సాహక ధనం




హిందూపురం పట్టు గూళ్ల మార్కెట్‌లో జరుగుతున్న క్రయవిక్రయాలు

మడకశిర: ఏడాది కాలంగా పట్టుగూళ్ల ఉత్పత్తి చేస్తున్న రైతులకు కూటమి ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రోత్సాహకాలు లేవు. పట్టు పురుగులు పెంచే షెడ్ల నిర్మాణానికి ఉపాధి హామీ పథకంలో అందించే రాయితీ సొమ్మూ రైతులకు చెల్లించడం లేదు. ఫలితంగా ఉమ్మడి జిల్లాలో బైవోల్టిన్ పట్టు రైతులు సంక్షోభంలో కూరుకుపోయారు. దీంతో బైవోల్టిన్ పట్టు సాగుపై రైతుల్లో ఆసక్తి సన్నగిల్లుతోంది. ప్రస్తుతం మార్కెట్‌లో బైవోల్టిన్ పట్టుగూళ్ళ ధరలు ఆశాజనకంగానే ఉన్నాయి. కిలో బైవోల్టిన్ పట్టుగూళ్ల ధర రూ.700కు పైగా పలుకుతోంది. ప్రోత్సాహక ధనం అందకపోవడంతో బైవోల్టిన్ పట్టుగూళ్ల ఉత్పత్తిని తగ్గిస్తున్నారు. హిందూపురం మార్కెట్‌కు రోజూ బైవోల్టిన్ పట్టుగూళ్ల దాదాపు 40 నుంచి 50 లాట్లు వచ్చేవి. ప్రస్తుతం రోజూ 30 లాట్‌ల లోపే ఉంటున్నాయి.

పేరుకుపోయిన రూ.66 కోట్ల బకాయి

ఉమ్మడి జిల్లాలో పట్టు రైతులు రెండు రకాల పట్టు గూళ్లను ఉత్పత్తి చేస్తున్నారు. పట్టు సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఆకర్షణీయమైన ప్రోత్సహకాలు ఇస్తోంది. బైవోల్టిన్ పట్టు గూళ్లను ఉత్పత్తి చేసి ప్రభుత్వ మార్కెట్‌లో విక్రయించిన రైతుకు కిలోకు రూ.50, అలాగే సీబీ రకం పట్టు గూళ్లకు కిలోకు రూ.10 చొప్పున ప్రోత్సాహక ధనాన్ని ప్రభుత్వం అందజేస్తూ వచ్చింది. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పట్టు రైతులు నయా పైసా ప్రోత్సాహక ధనం అందలేదు. ఈ క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా పట్టు రైతులకు రూ.66 కోట్ల బకాయిలు పేరుకుపోగా ఒక్క ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే రూ.27 కోట్ల బకాయిలు ఉండడం గమనార్హం. అలాగే పట్టుగూళ్ల నుంచి దారం వెలికి తీసే రీలర్లకూ ప్రతి కిలో దారానికి రూ.130 చొప్పున ప్రోత్సాహక ధనం చెల్లించాల్సి ఉంది. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఈ 17 నెలల కాలంలో నయా పైసా ప్రోత్సాహక ధనం అందలేదని రీలర్లు వాపోతున్నారు.

పట్టు రైతులకు ప్రభుత్వం అందించే ప్రోత్సాహక ధనం ఇలా...

బైవోల్టిన్ పట్టు రైతులకు :	కిలోకు రూ. 50
సీబీ పట్టు రైతులకు	: కిలోకు రూ. 10
రీలర్లకు అందించేది :	కిలో దారానికి రూ. 130

బకాయిలువెంటనే విడుదల చేయాలి



పట్టు రైతులను ఆదుకోవాలంటూ పట్టు రైతు సంఘం ఆధ్వర్యంలో పలుమార్లు విజయవాడకు వెళ్లి ప్రభుత్వ పెద్దలతో చర్చించాం. అయినా కూటమి సర్కారులో మార్పు రాలేదు. పట్టు రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ముందుకు రావాలి. పేరుకుపోయిన ప్రోత్సాహక ధనం బకాయిలు తక్షణమే విడుదల చేయాలి.

– వెంకట్రామిరెడ్డి, రాష్ట్ర పట్టు రైతు సంఘం అధ్యక్షుడు

తప్పని ఆర్థిక ఇబ్బందులు



ప్రభుత్వం ప్రోత్సాహక ధనం బకాయిలను మంజూరు చేయకుండా జాప్యం చేస్తోంది. దీంతో ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయాం. పరిస్థితి ఇలాగే ఉంటే పట్టుగూళ్ల ఉత్పత్తికి రైతులు స్వస్తి పలుకుతారు.

– సోమ్‌కుమార్, పట్టు రైతు సంఘం అధ్యక్షుడు, మడకశిర

పట్టించుకోని ప్రభుత్వం



కూటమి ప్రభుత్వం పట్టు రైతుల ఇబ్బందులను పట్టించుకోవడం లేదు. ప్రోత్సాహక ధనం కోసం అనేక రకాలుగా పోరాటం చేసినా కనికరం చూపడం లేదు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు కూడా బైవోల్టిన్ పట్టు రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదు. పట్టు రైతులకు ప్రోత్సాహక ధనం మంజూరు చేయకపోతే ఆందోళనకు దిగడం ఖాయం.

– ఆనంద రంగారెడ్డి, పట్టు రైతు సంఘం నాయకుడు, మడకశిర

జిల్లాకు 6.57 లక్షల స్మార్ట్ రైస్ కార్డులు


అనంతపురంలోని అశోక్‌నగర్‌లో స్మార్ట్ రైస్ కార్డు పంపిణీ చేస్తున్న జేసీ శివ్‌నారాయణ్ శర్మ

అనంతపురం అర్బన్: జిల్లాలో 6,57,248 మంది కార్డుదారులకు క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ రైస్ కార్డులను అందిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ శివనారాయణ్ శర్మ తెలిపారు. సోమవారం అనంతపురంలోని అశోక్‌నగర్‌లో కార్డుదారుల ఇళ్లకు వెళ్లి స్మార్ట్ రైస్ కార్డులను ఆయన అందజేశారు. ప్రతి కార్డుదారునికి ఇంటి వద్దకే సచివాలయ సిబ్బంది వెళ్లి కార్డును పంపిణీ చేయాలని ఆదేశాలిచ్చామన్నారు. కార్యక్రమంలో డీఎస్ఓ వెంకటేశ్వర్లు, అర్బన్ తహసీల్దార్ హరికుమార్, సీఎస్‌డీటీ బాషా, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఈత పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

గుంతకల్లు రూరల్: ఈ నెల 13న అనంతపురం వేదికగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి ఈత పోటీల్లో గుంతకల్లు మండలం తిమ్మాపురం జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్ 19 విభాగంలో సి. రాకేష్, అండర్ 14 విభాగంలో ఎస్.అభిరామ్ ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నారాయణరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు విజయప్రకాష్ తెలిపారు.

'అనంత' జానపద కళావైభవం


చిన్నారుల జానపద కళాప్రదర్శన

అనంతపురం కల్చరల్: 'అనంత' జానపద నృత్యం మరోసారి సరికొత్త చరిత్ర సృష్టించింది. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన కళాకారులు, విద్యార్థుల జానపద ప్రదర్శనలతో అనంతపురం లలితకళాపరిషత్తు సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు హోరెత్తింది. రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ సౌజన్యంతో రంగస్థల సకలవృత్తి కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 'జానపద కళా వైభవం -2025' పేరిట నిర్వహించిన మహాబృంద నృత్యం ఆహూతులను ఆకట్టుకుంది. సంస్థ నిర్వాహకులు సురభి ఆనంద్, డ్యాన్స్‌మాస్టర్ రమేష్ సంయుక్త నేతృత్వంలో 2025 మంది కళాకారులు అనంతకే సొంతమైన జానపదాలను అద్భుతంగా ప్రదర్శించి అలరించారు. ఈ ప్రదర్శన తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, మిరాకిల్ వరల్డ్ రికార్డు, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదు అయినట్టు నిర్వాహకులు తెలిపారు.

ముగ్గురు చిన్నారులకు డెంగీ


రోగులతో కిటకిటలాడుతున్న గుత్తి ప్రభుత్వాసుపత్రి


డెంగీ బారిన పడిన చిన్నారి వెంకట కృష్ణ

గుత్తి: పట్టణంలో ముగ్గురు చిన్నారులకు డెంగీ సోకింది. జ్వరంతో బాధపడుతున్న బండగేరికి చెందిన వెంకట కృష్ణ, చెర్లోపల్లి ప్రాంతానికి చెందిన ముస్తాక్, షణ్ముఖను సోమవారం తల్లిదండ్రులు గుత్తి ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చారు. ఈ క్రమంలో పరీక్షలు నిర్వహించిన వైద్యులు.. ముగ్గురికీ డెంగీ సోకినట్లు నిర్ధారించారు. గుత్తి పట్టణంలో అపరిశుభ్రత, పారిశుద్ధ్యం లోపించడంతో వైరల్ ఫీవర్లు అధికమయ్యాయి. జ్వర బాధితులతో సోమవారం ఆసుపత్రి కిటకిటలాడింది. తగినంత మంది వైద్యులు లేకపోవడంతో రోగులకు ఇబ్బందులు తప్పలేదు.

యూరియా ఇచ్చినోళ్లకే ఇవ్వద్దు : డీఏఓ

కణేకల్లు: యూరియా ఇచ్చినోళ్లకే ఇవ్వొద్దని సంబంధిత అధికారులను డీఏఓ ఉమామహేశ్వరమ్మ ఆదేశించారు. కణేకల్లులోని ఆదర్శభారతి రైతుసేవా సహకార సంఘంలో యూరియా పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం ఆమె తనిఖీ చేశారు. యూరియా కొరత లేకుండా సరఫరా చేస్తామని, రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె వెంట ఏఓ జగదీష్ ఉన్నారు.

యువకుడి బలవన్మరణం


సత్య (ఫైల్)

యాడికి: మండలంలోని నారాయణస్వామి కాలనీకి చెందిన రమణమ్మ కుమారుడు సత్య (23) ఆత్మహత్య చేసుకున్నాడు. ఆమెకు నలుగురు కుమారులు కాగా, ఇద్దరు కుమారులు పెళ్లి చేసుకుని తిరుపతిలో స్థిరపడ్డారు. చిన్న కుమారుడు సత్య బేల్దారి పనులతో తల్లిని పోషించుకునేవాడు. ఈ క్రమంలో కొన్ని రోజులుగా కడుపునొప్పితో బాధపడుతుండడంతో పనికి వెళ్లొద్దని తల్లి నచ్చచెబుతూ వచ్చింది. అయినా సత్య వినకుండా అలాగే పనికి వెళ్లేవాడు. ఈ క్రమంలో సోమవారం మూడో కుమారుడు బయటికి వెళ్లిన సమయంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న సత్య ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

నూర్పిడి యంత్రం బోల్తా.. మహిళా కూలీ మృతి


మృతురాలు గౌరమ్మ

కణేకల్లు: వేరుశనగ నూర్పిడి యంత్రం బోల్తాపడిన ఘటనలో ఓ మహిళా కూలీ మృతి చెందింది. మరో నలుగురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు.. తుంబిగనూరు గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు సోమవారం ఉదయం మీన్లహళ్లి గ్రామంలో ఓ రైతు పొలంలో వేరుశనగ నూర్పిడి చేసేందుకు నూర్పిడి యంత్రంతో బయల్దేరారు. గరుడచేడు దాటిన తర్వాత వంక వద్ద ప్రమాదవశాత్తు నూర్పిడి యంత్రం బోల్తా పడింది. యంత్రంపై కూర్చొని ఉన్న మహిళా కూలీ గౌరమ్మ (42), వనజాక్షి, స్నేహిత, సుజాతమ్మ, గంగమ్మ కింద పడ్డారు. గౌరమ్మపై యంత్రం పడడంతో ఆమె తలకు బలమైన గాయాలయ్యాయి. మిగిలిన నలుగురూ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. స్థానికులు గమనించి వెంటనే చికిత్స కోసం కణేకల్లులోని ఆస్పత్రికి తరలించగా అప్పటికే గౌరమ్మ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రతి చిన్నారికీ టీకా తప్పనిసరి : డీఎంహెచ్ఓ

అనంతపురం మెడికల్: ప్రతి చిన్నారికీ వ్యాధి నిరోధక టీకాలు క్రమం తప్పకుండా అందజేసేలా 'యూ విన్' పోర్టల్‌ను అందుబాటులో తీసుకువచ్చినట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబ దేవి తెలిపారు. పోర్టల్‌కు సంబంధించిన పోస్టర్లను సోమవారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో ఆమె ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ యుగంధర్, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ అనుపమజేమ్స్, డాక్టర్ విష్ణుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

రెడ్లపై వివక్ష వీడాలి

- రెడ్డి సంఘం నాయకుల వినతి


డీఆర్ఓ మలోలకు వినతిపత్రం ఇస్తున్న రెడ్డి సంఘం నాయకులు

అనంతపురం అర్బన్: రెడ్ల విషయంలో ప్రభుత్వం వివక్ష చూపుతోందని ఏపీ రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంగులకుంట నరేష్‌కుమార్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పాటిల్ రామకృష్ణారెడ్డి విమర్శించారు. తక్షణం రెడ్డి కార్పొరేషన్‌కు పాలమండలి ఏర్పాటు చేసి నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో డీఆర్‌ఓ ఎ.మలోలను నాయకులు కలసి వినతి పత్రం అందజేసి మాట్లాడారు. రెడ్డి సామాజిక వర్గానికి చెందిన యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు బ్యాంకుల ద్వారా సబ్సిడీ రుణాలను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ.. ఓసీల్లో అన్ని కులాల కార్పొరేషన్లకు పాలకమండళ్లను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. అయితే రెడ్డి కార్పొరేషన్‌కు మాత్రం పాలకమండలి ఏర్పాటు చేయకపోవడం చూస్తుంటే కూటమి ప్రభుత్వానికి రెడ్లపై ఎంత ద్వేషం ఉందో అర్థమవుతోందన్నారు. రాష్ట్రంలో 60 లక్షలకుపైగా రెడ్లు ఉన్నారన్నారు. రాజకీయంగా, వ్యాపారంపరంగా రెడ్లను బలహీనపర్చాలని కొందరు చేస్తున్న ప్రయత్నాలు ఎప్పటికీ ఫలించవన్నారు. కాబట్టి రెడ్ల విషయంలో ప్రభుత్వం సానుకూలంగా ఉండాలన్నారు. రెడ్లను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో రాజకీయంగా ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కృష్ణారెడ్డి, సోమిరెడ్డి, చవ్వా హనుమంతరెడ్డి, అరవింద రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, హనుమంతరెడ్డి, అనిల్ రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, పరంధామరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నడిమివంకలో దర్జాగా నిర్మాణం

- సచివాలయ సిబ్బందిని ఖాతరు చేయని ఆక్రమణదారుడు
- ప్రేక్షకపాత్రలో నగరపాలక సంస్థ అధికారులు



నడిమివంకలో అక్రమంగా చేపట్టిన పునాది నిర్మాణం

అనంతపురం కార్పొరేషన్: అధికార పార్టీ అండ చూసుకుని నగరంలో కొందరు దర్జాగా ఆక్రమణలు చేస్తున్నారు. టౌన్‌ప్లానింగ్ విభాగం నిర్లక్ష్యం ఆక్రమణదారులకు వరంగా మారుతోంది. ఇప్పటికే ఇబ్బడి ముబ్బడిగా అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నా ఎవ్వరూ పట్టించుకునే పరిస్థితి లేదు. డ్రెయినేజీలపై కొద్దిపాటి నిర్మాణం చేపడితేనే ఆగమేఘాలపై టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు వాలిపోతుంటారు. అయితే సంగమేష్ సర్కిల్ సమీపంలోని నడిమి వంకలో అక్రమంగా నిర్మాణం చేపడుతున్నా తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తుండటం విమర్శలకు తావిస్తోంది. అంబేడ్కర్ నగర్‌కు వెనుక వైపు ఓ నిర్మాణం ఇది వరకే ఉంది. స్థానికంగా ఉండే ఓ వ్యక్తి గుట్టుచప్పుడు కాకుండా వంకలో పునాది నిర్మించాడు. నెలల తరబడి నిర్మాణం జరుగుతున్నా నగరపాలక సంస్థ అధికారులు కానీ, ఇరిగేషన్ అధికారులు కానీ అటువైపు తొంగి చూడడం లేదు.

సచివాలయ సిబ్బందికే ఝలక్!

సచివాలయ సిబ్బంది ఆలస్యంగానైనా మేల్కొన్నారు. సోమవారం నడిమివంకలో నిర్మాణం చేపట్టిన వ్యక్తి వద్దకు వెళ్లారు. నిర్మాణం చేపట్టరాదని చెబితే.. సదరు వ్యక్తి తనకు టీడీపీకి చెందిన ప్రజాప్రతినిధి తెలుసని, ఏమైనా ఉంటే అక్కడి నుంచి ఫోన్ చేయిస్తానంటూ సచివాలయ సిబ్బందికే ఝలక్ ఇచ్చాడు. దీంతో సచివాలయ సిబ్బంది మిన్నకుండిపోయి అక్కడినుంచి వెనుదిరిగి వచ్చేశారు.

అక్రమ నిర్మాణంపై ఫిర్యాదు

సంగమేష్ సర్కిల్ సమీపంలోని నడిమివంకలో అనధికారికంగా చేపడుతున్న నిర్మాణాన్ని తక్షణం ఆపాలంటూ వైఎస్సార్‌సీపీ నాయకుడు సాకే కుళ్లాయస్వామి (21వ డివిజన్) 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో ఫిర్యాదు చేశారు. మరి టౌన్‌ప్లానింగ్ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి మరి.

క్లుప్తంగా

'గాలికుంటు' టీకాలు తప్పనిసరి



పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేస్తున్న టీవీ సుధాకర్

రాప్తాడు: గాలికుంటు వ్యాధి రాకుండా నివారించడానికి పశువులకు టీకా తప్పనిసరిగా వేయించాలని పశుసంవర్ధక శాఖ సంయుక్త అధికారి టి.వి.సుధాకర్ సూచించారు. సోమవారం మండలంలోని రాప్తాడు, ఎం.బండమీదపల్లి, ఎం.చెర్లోపల్లిలో గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమం నిర్వహించారు. రాప్తాడులో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని టి.వి.సుధాకర్ ప్రారంభించారు. కార్యక్రమంలో డివిజనల్ అధికారి రమేష్ రెడ్డి, అడిషినల్ ఏడీ రవిబాబు, డాక్టర్ ప్రకాష్, ఏహెచ్‌ఏ విజయ్, ఏహెచ్‌ఏ గ్రేసమ్మ, రైతులు పాల్గొన్నారు.

19న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు

అనంతపురం: అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19న అండర్-14, 16, 18, 20 కేటగిరీల్లో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నారు. నగరంలోని నీలం సంజీవరెడ్డి స్టేడియంలో జరిగే పోటీల్లో పాల్గొనే వారు ఈ నెల 19న ఉదయం 8 గంటలకు వయస్సు ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని అథ్లెటిక్స్ అసోసియేషన్ కమిటీ చైర్మన్ డి.ఇస్మాయిల్, కన్వీనర్ రవికుమార్, జి.సుదర్శన్ తెలిపారు. ఈ మేరకు వారు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పూర్తి వివరాలకు 90522 88643, 90103 23468 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

హాస్టల్ విద్యార్థులకు ఆరోగ్య సమస్యలు



డీఆర్‌ఓకు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్ విద్యార్థి సంఘం నాయకులు

అనంతపురం అర్బన్: ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో పారిశుద్ధ్యం లోపించి విద్యార్థులు ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని వైఎస్సార్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్ ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని పరిష్కార వేదికలో డీఆర్‌ఓ మలోలకు వినతిపత్రం అందజేసి పరిస్థితి వివరించారు. వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. వసతిగృహాల్లో పారిశుద్ధ్యం లోపించడంతో చర్మ, శ్వాస సంబంధిత సమస్యలతో విద్యార్థులు బాధపడుతున్నారన్నారు. దోమతెరలు లేకపోవడంతో దోమలకాటుకు విద్యార్థులు గురై మలేరియా, టైఫాయిడ్ జ్వరాలబారిన పడుతున్నారన్నారు. వసతిగృహాల్లో హెల్త్ క్యాంపులు నిర్వహించి చికిత్సలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్‌రాయల్, నగర అధ్యక్షుడు కై లాష్, ప్రధాన కార్యదర్శులు అశోక్‌రాయల్, నరేందర్ రెడ్డి, రాహుల్‌రెడ్డి, లోకేష్, సాయి, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ విస్మరించిన అధికారులు..

ఆత్మకూరు: ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించి ఏ కార్యక్రమమైనా స్థానిక ప్రజా ప్రతినిధుల చేతుల మీదుగా జరగాలి. కానీ ఆత్మకూరులో ఇందుకు విరుద్ధంగా జరుగుతోంది. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీకి సంబంధించి కనీస సమాచారం ఇవ్వకపోవడంపై రెవెన్యూ అధికారుల తీరుపై మండల ప్రజా ప్రతినిధులు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులతో కాకుండా కేవలం టీడీపీ నేతలచే స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానికంగా ఉన్న సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైస్ ఎంపీపీలకు, ఎంపీపీలకు కనీస సమాచారం కూడా ఇవ్వకుండా కార్యక్రమాలను నిర్వహిస్తుండటంపై ప్రజాప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం వీఆర్వోలకు కూడా సమాచారం ఇవ్వలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీనాయక్, ముట్టాల ఎంపీటీసీ పారిజాతం, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసులపై చర్యలు తీసుకోవాలి

అనంతపురం టవర్‌క్లాక్: పేకాట ఆడుతున్నారని శింగనమల మండలం నాగలగుడ్డం తండాకు చెందిన రామకృష్ణను పోలీసులు కొట్టడం వల్లే మృతి చెందాడని, బాధ్యులైన వారిని విధులనుంచి తొలగించి చర్యలు తీసుకోవాలని జైభీమ్ రావ్ భారత్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామప్ప నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పేకాట ఆడినంత మాత్రాన ప్రాణాలు పోయేలా కొట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మృతుడి కుటుంబానికి రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కార్పొరేషన్‌లో విలీనం చేయండి



అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ పరిధిలోని పాపంపేట, కక్కలపల్లికాలనీ పంచాయతీని నగరపాలక సంస్థలో విలీనం చేయాలని స్థానిక ప్రజాప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వతహాగా నగర సరిహద్దులకు మిళితమైన తమ గ్రామాల విలీన అంశాన్ని దశాబ్దాలుగా వినతులు, తీర్మానాలు, ప్రజాసంతకాల సేకరణ ద్వారా కోరుతున్నా ఎలాంటి పరిపాలనా చర్యలు ప్రారంభించలేదన్నారు. 1950 నుంచి ఈ రెండు ప్రాంతాలు అనంతపురం మునిసిపాలిటీ పరిధిలో భాగంగా పరిగణించబడినట్లు పేర్కొన్నారు. భూముల విలువ పట్టణస్థాయిలో ఉన్నప్పటికీ పంచాయతీ హోదా కారణంగా ఇప్పటికీ అభివృద్ధి చెందలేదన్నారు. పీఏబీఆర్ తాగునీటి ప్రాజెక్ట్ పరిధిలో ఉన్నా...ఇప్పటిదాకా ఆనీరు అందలేదన్నారు. 28 వేల ఓటర్లు, 60 వేలకు పైగా జనాభా ఉండడం వల్ల పట్టణ పరిపాలన అవసరం అనివార్యమైందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి తమ ప్రాంతాలను కార్పొరేషన్‌లోకి విలీనం చేయాలని విజ్ఞప్తి చేశారు. అధికారులను కలిసిన వారిలో కక్కలపల్లికాలనీ సర్పంచ్ జి.తేజశ్విని, ఎంపీటీసీ సభ్యులు వడ్డే శ్రీనివాసులు, కె.గాయత్రిదేవి, వార్డు మెంబర్లు ఎం.వరలక్ష్మి, స్రవంతి, ఫాతిమా, పాపంపేట మాజీ ఎంపీటీసీ సభ్యుడు మతం శ్యాంసుందర్ ఉన్నారు.

వేతనాలు ఇవ్వకపోతే ఎలా?



ఎస్‌ఈ రాజశేఖర్‌కు వినతిపత్రం అందిస్తున్న పారిశుధ్య కార్మికులు

అనంతపురం కార్పొరేషన్: రెండు నెలలుగా వేతనాలు ఇవ్వకపోతే కుటుంబాలు ఎలా పోషించుకోవాలని నగరపాలక సంస్థలో విధులు నిర్వర్తిస్తున్న అదనపు పారిశుధ్య కార్మికులు సాకే తిరుమలేష్, ఎర్రిస్వామి, శేషేంద్రకుమార్, బి.రాఘవేంద్ర, లక్ష్మి నరసమ్మ తదితరులు ప్రశ్నించారు. సోమవారం నగరపాలక సంస్థలో ఉన్న సచివాలయంలో జరిగిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో వారు ఎస్‌ఈ రాజశేఖర్‌కు వినతిపత్రం అందించారు. ఇది వరకే రెండు పండుగలు వచ్చిపోయాయని, కనీసం దసరా లోపైనా వేతనాలు ఇప్పించేలా చూడాలని కోరారు.

- నగరంలోని 67వ సచివాలయంలో సిబ్బంది అందుబాటులో ఉండడం లేదని స్థానికులు ఫిర్యాదు చేశారు. 39వ డివిజన్ వడ్డేవారి కాలనీలో రూ.30 లక్షలతో రోడ్డు, కాలువ మంజూరైనా ఇంతవరకు నిర్మాణం చేపట్టలేదని స్థానికులు రత్నమయ్య ఫిర్యాదు చేశారు. మూడో రోడ్డులో రోడ్డు మంజూరైందని, కంకర వేసి వదిలేయడంతో వాహనదారులు, పాదాచారులకు ఇబ్బంది మారిందని స్థానికులు కరణం వెంకట సుబ్బారావు ఫిర్యాదు చేశారు. 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో మొత్తం 16 ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో మేనేజర్ ఖయ్యూం, సీనియర్ అసిస్టెంట్ మురళి, జూనియర్ అసిస్టెంట్ నల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి



సభ్యత్వ స్వీకరణ చేస్తున్న ఎస్టీయూ నాయకులు

ఆత్మకూరు: ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు నీలూరు రమణారెడ్డి కోరారు. సోమవారం మండలంలోని సనప , తలుపూరు, వడ్డుపల్లి, పంపనూరు, ముట్టాల, పంపనూరు తండా గ్రామాల్లోని పాఠశాలల్లో ఉపాధ్యాయులు సమస్యల సేకరణ- సభ్యత్వ స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని యాజమాన్యాల్లో పని చేస్తున్న క్లస్టర్ ఉపాధ్యాయులకు డీఎస్సీ అంతర జిల్లా బదిలీల్లో వచ్చే వారి కంటే ముందుగా శాశ్వత ప్రతి పాదికన స్థానాలను కేటాయించి న్యాయం చేయాలన్నారు. దీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న అర్జిత సెలవుల నగదు బకాయిలు తక్షణమే విడుదల చేయాలని, పీఆర్‌సీ ఆలస్యమవుతున్న నేపథ్యంలో ఐఆర్ 30 శాతం ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రశేఖరరావు, మండల ప్రదాన కార్యదర్శి రవి, జిల్లా నాయకుడు రాకృష్ణ పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ నియంత్రణకు కృషి చేయాలి



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి

అనంతపురం మెడికల్: హెచ్‌ఐవీ/ఎయిడ్స్ నియంత్రణకు కృషి చేయాలని ఆరోగ్యశాఖ సిబ్బందికి డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ భ్రమరాంబదేవి సూచించారు. సోమవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఏపీ ఎయిడ్స్ నియంత్రణ మండలి ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో రెండు నెలల పాటు నిర్వహించే ప్రచార కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ డిస్‌ప్లే ప్రచార రథాన్ని డీఎంహెచ్‌ఓ జెండా ఊపి ప్రారంభించారు. హెచ్‌ఐవీ బాధితుల పట్ల వివక్ష చూపడం సరికాదన్నారు. రోజూ 6 నుంచి 8 ప్రాంతాల్లో ప్రచారం చేసి.. ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ వెంకటరత్నం, సూపర్‌వైజర్ జీవీ రమణ, పాల్గొన్నారు.

ఉద్యోగాలు సాధించిన వారికి అభినందనలు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో బీఈడీ పూర్తి చేసి డీఎస్సీ, పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలు పొందిన 29 మంది విద్యార్థులకు ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి.అనిత సోమవారం జ్ఞాపికలు అందజేసి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ జి.వెంకటనాయుడు, రిజిస్ట్రార్ రమేష్‌బాబు పాల్గొన్నారు.

షరతులు లేకుండా ఆర్థికసాయమందించాలి



నిరసన తెలుపుతున్న ఆటో డ్రైవర్లు

అనంతపురం అర్బన్: ఆటో, మ్యాక్సీ, క్యాబ్ డ్రైవర్లకు షరతులకు లేకుండా రూ.15వేల ఆర్థికసాయం మంజూరు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆటో డ్రైవర్లు, కార్మికుల సంఘం ఆధ్వర్యంలో నగరంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆటో డ్రైవర్లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాజేష్‌గౌడ్ మాట్లాడుతూ దసరా పండుగకు ఆటో కార్మికులకు వాహనమిత్ర పథకం కింద రూ.15 వేల ఆర్థికసాయం ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారన్నారు. అయితే షరతులు లేకుండా పథకాన్ని అమలు చేయాలన్నారు. స్త్రీశక్తి పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అమలు చేయడంతో ఆటోడ్రైవర్లకు ఉపాధి తగ్గిపోయిందన్నారు. కార్మికులకు ఇబ్బందికి గురిచేసే జీవోలు 21, 31ను రద్దు చేయాలన్నారు. ఆటో కార్మికులకు ప్రత్యేకంగా సంక్షేమ బోర్డు తీసుకురావాలన్నారు. ఆర్టీసీలో ఖాళీగా ఉన్న పోస్టులను ఆటో డ్రైవర్లతో భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి కృష్ణుడు, ఆటో సంఘం అధ్యక్ష, ఉప ప్రధాన కార్యదర్శి రాజు, కృష్ణానాయక్, నాయకులు నరసింహులు, ముత్యాలు, నారాయణస్వామి, వెంకటేష్, నాయక్, నల్లప్ప, నాగరాజు, శివ, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

అక్కంపల్లి పంచాయతీ సమస్యలు పరిష్కరించండి



పంచాయతీ కార్యదర్శితో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం అక్కంపల్లి పంచాయతీ పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఐ రాప్తాడు నియోజకవర్గ కార్యదర్శి ఎం.రమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం అక్కంపల్లి పంచాయతీ కార్యదర్శి మహమ్మద్ రఫీని కలిసి వినతిపత్రం అందజేశారు. రమేష్ మాట్లాడుతూ పంచాయతీలోని ఎన్ఆర్ కాలనీ, ధర్మ బిక్షం కాలనీ, అంబేడ్కర్ కాలనీ, వైఎస్సార్ కాలనీ, సదాశివకాలనీలలో రోడ్లు, డ్రెయినేజీలు, విద్యుత్ దీపాలు చాలా అధ్వానంగా ఉన్నాయని వాపోయారు. ఎన్ఆర్ కాలనీలో రోడ్లకు ఇరువైపులా ఆక్రమణలు పెరిగిపోయాయన్నారు. వర్షపు నీళ్లన్నీ రోడ్లపై నిలబడటంతో దోమల బెడద ఎక్కువై ప్రజలు జ్వరాలబారిన పడుతున్నారన్నారు. కాలనీల్లో సమస్యలు వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో ప్రజలను సమీకరించి దశలవారీగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ రూరల్ మండల కార్యదర్శి జి.నరేష్, సహాయ కార్యదర్శి జి.దుర్గాప్రసాద్, నాయకులు శ్రీకాంత్, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాప్తాడు నియోజకవర్గ కార్యదర్శి జి. శారద, నారాయణ స్వామి, గోవిందు అక్కులన్న, గంగానాయక్, జీవీ వెంకటేశులు, కుళ్లాయప్ప పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై ఏపీటీఎఫ్ పోరుబాట



వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల న్యాయమైన, దీర్ఘ కాలిక అపరిష్కృత సమస్యల పరిష్కారం కోసం ఏపీటీఎఫ్ పోరుబాట పట్టింది. ఇందులో భాగంగా దశలవారీగా ప్రాతినిధ్యాలు, నిరసనలు, ఆందోళనలు, సీఎం, సీఎస్‌లకు మెయిల్ చేయాలని నిర్ణయించారు. అప్పటికీ సమస్యలు పరిష్కరించకపోతే ప్రత్యక్ష పోరాటాలకు సిద్ధమవుతామని నాయకులు చెబుతున్నారు. నిరసనల్లో భాగంగా సోమవారం అనంతపురం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.సిరాజుద్దీన్, రాష్ట్ర పూర్వ కార్యదర్శి నరసింహులు మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలన్నారు. 12వ పీఆర్సీని నియమించి ఐఆర్ ప్రకటించాలన్నారు. అన్ని రకాల ఆర్థిక బకాయిలను చెల్లించాలని, ఈహెచ్ఎస్ పరిమితిని రూ. 25 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. యాప్‌లు, అసెస్మెంట్ బుక్‌లెట్ విధానాన్ని రద్దుచేసి ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు డి. గాయత్రి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సర్దార్ వలి, రాష్ట్ర కౌన్సిలర్ వెంకటరమణ, జిల్లా ఆడిట్ కన్వీనర్ వన్నప్ప, నాయకులు బాలముద్దన్న, సూర్యనారాయణ, లక్ష్మీనారాయణ, శివారెడ్డి, ఎల్లప్ప, పర్వతయ్య, తిప్పేస్వామి పాల్గొన్నారు.

పిటీషన్లు పునరావృతం కాకూడదు



పిటీషనర్లతో మాట్లాడుతున్న ఎస్పీ జగదీష్

అనంతపురం: పిటీషన్లు పునరావృతం కాకుండా పరిష్కారం చూపాలని ఎస్పీ జగదీష్ పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఎస్పీ ఫిర్యాదులు స్వీకరించారు. వచ్చిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి చట్టపరిధిలో బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్పీతో పాటు డీసీఆర్బీ సీఐ హరినాథ్ పాల్గొన్నారు.

నగరూర్ రైల్వేస్టేషన్‌లో 'నాందేడ్ ఎక్స్‌ప్రెస్' హాల్ట్

గుంతకల్లు: నాందేడ్ ఎక్స్‌ప్రెస్ రైలును ఈ నెల 18 నుంచి నగరూర్ రైల్వేస్టేషన్‌లో నిలుపుదలకు (హాల్ట్) అనుమతులు ఇచ్చినట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ శ్రీధర్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 18 నుంచి బెంగుళూరు-నాందేడ్ (16593) ఎక్స్‌ప్రెస్ రైలు గుంతకల్లు-ఆదోని సెక్షన్‌లోని నగరూర్ రైల్వేస్టేషన్‌కు ఉదయం 6.59కు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 19వ తేదీ నుంచి ఈ రైలు (16594) రాత్రి 8.19కు చేరుతుందన్నారు.

ప్రపంచం గర్వించదగ్గ ఇంజినీర్ మోక్షగుండం



జేఎన్‌టీయూలో మోక్షగుండం విగ్రహానికి నివాళులర్పిస్తున్న వీసీ సుదర్శనరావు



రిటైర్డ్ డిప్యూటీ ఎస్‌ఈ నారాయణరెడ్డిని సన్మానించిన ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ అనిత

అనంతపురం: ప్రపంచం గర్వించదగిన గొప్ప ఇంజినీర్‌గా మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఖ్యాతి దక్కించుకున్నారని జేఎన్‌టీయూ (ఏ) వీసీ ప్రొఫెసర్ హెచ్. సుదర్శనరావు అన్నారు. మోక్షగుండం విశ్వేశ్వర్య జయంతిని పురస్కరించుకుని జేఎన్‌టీయూ (ఏ) ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీర్స్ డే నిర్వహించారు. వీసీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇంజినీరింగ్ పితామహుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని ప్రశంసించారు. ఈ సందర్భంగా ఇంజినీరింగ్ కళాశాల మెయిన్ బిల్డింగ్‌లో అప్పట్లో ఏర్పాటు చేసిన క్లాక్ టవర్‌ను మరమ్మతులు చేసి ప్రారంభించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కృష్ణయ్య, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చెన్నారెడ్డి పాల్గొన్నారు.

- ఎస్కేయూ ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీర్స్‌డే కార్యక్రమానికి ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి.అనిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఆర్‌అండ్‌బీ డిప్యూటీ సూపరింటెండెంట్ ఇంజినీర్ నారాయణరెడ్డిని ఆమె ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ జి.వెంకటనాయుడు, రిజిస్ట్రార్ రమేష్‌బాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర పాల్గొన్నారు.
- జేఎన్‌టీయూ అనంతపురం క్యాంపస్‌లో ఏబీవీపీ ఆధ్వర్యంలో ఇంజినీర్స్‌డే ఘనంగా నిర్వహించారు. మోక్షగుండం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏబీవీపీ జేఎన్‌టీయూ ఇన్‌చార్జ్ గణేష్, వంశీరెడ్డి, గిరీష్, దివాకర్‌రెడ్డి, సూర్యకిరణ్, తరుణ్, దేవప్రసాద్, అంకిరెడ్డి, భూతరాజు, విజయ్ పాల్గొన్నారు.

నేడు సావిత్రిబాయి పూలే విగ్రహావిష్కరణ



జెడ్పీ క్యాంపస్‌లో జ్యోతిరావు పూలే విగ్రహం పక్కనే ఏర్పాటు చేసిన సావిత్రిబాయి పూలే విగ్రహం

అనంతపురం సిటీ: విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యమని నమ్మిన ధీర వనిత సావిత్రిబాయి పూలే. నిమ్న వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన జ్యోతిరావు పూలే సతీమణి ఆమె. ఆధునిక భారతదేశంలో తొలి మహిళా ఉపాధ్యాయినిగా చరిత్ర సృష్టించిన సావిత్రిబాయి పూలేకు అనంతపురం శాశ్వత చిరునామాగా మారనుంది. భర్త పూలే విగ్రహం పక్కనే సావిత్రిబాయి విగ్రహం ఏర్పాటుతో ఇది సాధ్యం కానుంది. అందుకు జిల్లా పరిషత్ క్యాంపస్ వేదిక కానుంది. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ విగ్రహాన్ని తన సొంత డబ్బుతో సుందరంగా చేయించారు. జ్యోతిరావుపూలే-సావిత్రిబాయి పూలే విగ్రహాల చుట్టూ ఇనుప కంచె ఏర్పాటు చేయించి, మధ్యలో పచ్చని గడ్డి పెంచేలా ప్రణాళిక రూపొందించారు. ఇందుకు జెడ్పీ నిధులు రూ.25 లక్షలతో అన్ని హంగులతో ఏర్పాటు చేశారు. మంగళవారం సావిత్రిబాయి పూలే విగ్రహాన్ని చైర్‌పర్సన్ ప్రారంభించనున్నారు. ఉమ్మడి జిల్లా నుంచి తరలివచ్చే ప్రజాప్రతినిధులు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, అన్ని శాఖల అధికారుల సమక్షంలో ఆమె లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఆ తరువాత జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ప్రారంభం కానుంది.

18న బార్లకు లాటరీ

అనంతపురం: నూతన బార్ పాలసీ (2025-28)లో భాగంగా జిల్లా వ్యాప్తంగా 9 బార్లకు ఈ నెల 17 వరకు దరఖాస్తుకు తుదిగడువుగా నిర్దేశించినట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. గతంలో బార్లకు లాటరీ నిర్వహించగా 9 బార్లకు దరఖాస్తులు రాలేదు. దీంతో తాజాగా ఈ బార్లకు (అనంతపురంలో మూడు, గుంతకల్లు రెండు, గుత్తి, తాడిపత్రి, కళ్యాణదుర్గం, రాయదుర్గంలో ఒక్కొక్కటి చొప్పున బార్లకు) ఈ నెల 12న నోటిఫికేషన్ జారీ చేశామన్నారు. జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో ఈ నెల 18న కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ ప్రక్రియ నిర్వహిస్తామని తెలిపారు.

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్ చేయాలి



జిల్లా కోర్టులో ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు

అనంతపురం: ఆర్డీటీ సంస్థను పరిరక్షించాలని జిల్లా కోర్టులో న్యాయవాదులు డిమాండ్ చేశారు. ఆర్డీటీ సంస్థకు ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్ చేయాలనే డిమాండ్‌తో సోమవారం జిల్లా కోర్టులో న్యాయవాదులు విధులను బహిష్కరించారు. జిల్లా కోర్టు నుంచి టవర్‌క్లాక్ వరకు ర్యాలీ చేపట్టారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో పేద, మధ్యతరగతి, బడుగు,బలహీన, ఎస్సీ, ఎస్టీలకు ఆర్డీటీ అండగా నిలుస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్ చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు జి.ఉమాపతి, పి.నరసింహులు, ఎం.వేణు, యు.శీనా, కె.విద్యాపతి, నారాయణప్ప, మహిళా న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి పరిరక్షణ సామాజిక బాధ్యత



వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ విజయశ్రీ

అనంతపురం మెడికల్: ప్రకృతి పరిరక్షణ సామాజిక బాధ్యత అని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం విజయశ్రీ పేర్కొన్నారు. ఇటీవల ఎన్ఎస్ఎస్ యూనిట్, అనంతపురం రామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో మానసిక వికాసానికి ప్రకృతితో శృతి కలిగి ఉండడం చాలా అవసరం అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అందులో ప్రతిభ చూపిన వైద్య విద్యార్థులను ప్రిన్సిపాల్ సోమవారం అభినందించారు. సామాజిక సేవలో వైద్య కళాశాల విద్యార్థులు ముందుండాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ షారోన్ సోనియా, పీడియాట్రీషియన్ డాక్టర్ శంకర్ నారాయణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆదిరెడ్డి పరదేశీ నాయుడు పాల్గొన్నారు.